

# ఈ బ్రతుకింతే!

—లోగిశ లక్ష్మీతులసి

వడి వడిగా నడుస్తున్నాను.

ఆఫీసుకు వేళవుతోంది. పదిన్నరలోపల ఆఫీసులో ఉండాలి. లేదా, సెక్షన్ సూపర్నెంటుగారి ఆగ్రహానికి గురికాక తప్పదు.

రోజో మైలున్నర నడిచి ఆఫీసుకు చేరాలి. సిటీ బస్సులున్నా సరిగ్గా టైమ్‌కు తగలడవు. ఒక వేళ తగలడ్డా నిలబడడానికి కూడా ఖాళీదొరకదు. పోనీ, నిలబడడానికి కొంచెం ఖాళీగా ఉన్నట్లునిపించినా బస్సు ఎక్కడానికి తనకి దమ్ములెక్కడివి? కుమ్ములాడుకుంటున్న వాళ్ళని కుమ్ముకొని తను బస్సెక్కగలడా?

ఆలోచిస్తూ నడుస్తున్నాను.

చిన్న వాల్తేరు నుండి వస్తున్న సిటీ బస్సు వచ్చి నా ముందుఆగింది. అందులో నుండి గోపాలకృష్ణ నవ్వుకుంటూ దిగాడు.

"హల్లో స్వామినాథం గారూ!" దిగుతూనే నన్ను పలకరించాడు.

"హల్లో" అన్నాను.

ఇద్దరం ఆఫీసు కేసి నడుస్తున్నాం.

"మీరు రోజూ నడిచేవస్తారా?" అన్నాడు గోపాలకృష్ణ.

"ఏం చెయ్యమంటారు? ఇంత కన్నా సౌఖ్యం...సౌఖ్యం...సులభమైన మార్గం వేరే ఏదీలేదు. ఆర్థికంగానూ....ఆరోగ్యపరంగానూ చాలామంచిది. కాదంటారా?!" నవ్వుతూ అన్నాను.

నామాట విన్నాడో... లేదోగాని మాట్లాడుతూ...మాట్లాడుతూ ఉన్నట్టుండి ఎటోచూస్తూ 'హల్లో' అన్నాడు గోపాలకృష్ణ, ఎవర్నో పలకరించాడు. వెనుదిరిగి చూసాను. నాకు తెలిసిన మొహం ఎవరూ కనిపించలేదు.

"ఎవరూ?!" అన్నాను సందిగ్ధంగా.

"మీరు శ్రీరామ చంద్రులు, మీకెందుకు లెద్దురూ!" అన్నాడు గోపాలకృష్ణ అప్పుడర్థమయింది.

మా ప్రక్కనుండి విమానంలా ముందుకు పోతోంది ఓ అమ్మాయి. ఆ అమ్మాయి ఎవరో కాదు. మా సెక్షన్ సూపర్నెంటు గారి ఏకైక సుపుత్రిక, యూనివర్సిటీలో ఎమ్మే చేస్తోంది.

పాపం! గోపాలకృష్ణ! ఆమె ఎవరోతెలియక తిక్కగా ప్రవర్తిస్తున్నాడు.

గోపాలకృష్ణ మా ఆఫీసులో చేరి ఆర్నెల్లు కూడా కాలేదు. 'సర్వీసు కమీషన్ మోసుకొచ్చి మా ఆఫీసులోమొన్నే పడేసింది.

"ఆమె ఎవరో మీకు తెలీదా?" అన్నాను.

"తెలీదు! ఎవరూ?!" అన్నాడు. అని సంశయంగా నా కళ్ళల్లోకి చూసాడు.

మన చండశాసనుడు....సూపర్నెంట్ గారి అమ్మాయి." అన్నాను.

"ఆఁ?" అని మాత్రం అనగలిగాడు గోపాలకృష్ణ, ఓ క్షణం మాట్లాడలేక పోయాడు. అయిదు నిమిషాల నడకలో అక్షరంకూడా మాట్లాడ లేదు.

"ఏమిటి విశేషాలు! మా విశాఖపట్నం ఎలాఉంది?" అన్నాను. షాక్ తిన్న అతన్ని మామూలు మనిషిని చేద్దామని.

"చాలా బావుంది. అందమైన అమ్మాయిలు... ఆహ్లాదకరమైన సాయంత్రాలు... అందీ అందని ద్రాక్ష పళ్లలా నోరూరించే అమ్మాయిల్ని చూస్తూ సాయంత్రాలు బీచ్ అంచుల్లో గడిపితే ఎంత హాయిగా ఉంటుంది? తీపి ఊహలు రేపే గుండెలోని గాయాలు మధురమైన గేయాలై గొంతులో పలకవూ?! భావకవి భావాల్లా అలలు కెరటాలు...కెరటాలుగా తీరాన్ని చేరి పాదాలను తాకి చక్కలిగింతలు పెట్టినెరజాణ వాలు కళ్ళలా నెలవాలి వెనక్కు మళ్ళి పోతుంటే....!అబ్బ! ఎంత స్పందన కలుగుతుందండీ ఈ పిసరంత గుండెలో....!" గోపాలకృష్ణ తన్మయంతో

ఏదేదో చెప్పుకు పోతున్నాడు.

"గోపాలకృష్ణ గారూ!....గోపాలకృష్ణ గారూ! ఏమండీ బాబూ! దారిలోనే అల్లేస్తున్నారు కవిత్వాన్ని. ఆపండాపండి." భుజం చరుస్తూ అన్నాను.

"అది సరేగాని సార్! నాకు రూమ్ ఓటి వెదికి పెడుదురూ! ప్రస్తుతానికి మాచుట్టాలింట్లో తలదాచు కుంటున్నాను. పావం! వాళ్ళు నా వలన ఇబ్బంది పడుతున్నట్టున్నారు." అన్నాడు గోపాలకృష్ణ వాస్తవానికివచ్చి.

"అలాగే!" అన్నాను.

ఇద్దరం ఆఫీసులో అడుగు పెట్టాం.

అప్పటికే సూపర్నెంట్‌గారు సీట్లో ఆశీనులై ఉన్నారు. ఏదో వ్రాసేనుకుంటున్నారు. మా వెనుకే సూపర్నెంటుగారి అమ్మాయి ఆఫీసులో అడుగు పెట్టింది. ఆమెని చూసేసరికి గోపాలకృష్ణకి ప్రైప్రాణాలు పైనే పోయాయి.

అతని మొహంలో భయం కొట్టొచ్చినట్టూ కన్పిస్తోంది.

నావైపు బితుకు...బితుకుగా చూసాడు. నేను నవ్వుకుంటూ నాసీట్లోకి వెళ్ళి కూర్చున్నాను. గోపాలకృష్ణ తన సీట్లోకి వెళ్ళి కూర్చున్నాడు. నా ఎదుటి సీటే గోపాలకృష్ణది.

మా సెక్షన్‌లో రమారమి కేజువల్ ఉద్యోగులతో కలిసి వందకుపైనే ఉండొచ్చు. మా ఆఫీసులో మా సెక్షన్ లాంటి సెక్షన్‌లు ఇరవై ఉన్నాయి మా ఆఫీసులో. సుమారు రెండు వేలకు పై చిలుకు ఉంటారు మొత్తం ఆఫీసు స్టాఫ్ అంతా!

పదిన్నర అయేసరికి మా సెక్షన్‌లో ఖాళీ సీట్లన్నీ నిండుకున్నాయి. ఎవరి సీట్లలో వాళ్ళు తలలు దించుకుని ఏదో బరికేస్తున్నారు పని. నేను నాపనిలో లీనమై పోయాను.

మద్యాహ్నం 'లంచ్' టైంకి సీత కేరేజులు మోసుకు వచ్చింది.

సీత మా ఆఫీసు వాళ్ళకు కేరియర్‌లు తీసుకు వస్తూంటుంది. అలా అందరి ఇళ్ల దగ్గర్నుండీ కేరియర్‌లు తీసుకు వచ్చినందుకు ఒక్కొక్కరూ నెలకి పదిహేను రూపాయలు ఇస్తుంటారు. అలా ఆమె సుమారుఇరవైకుపైగా కేరియర్లు తెస్తుంటుంది.

సీతలాంటి వాళ్ళు మా ఆఫీసు మీద ఆధారపడి రమారమి ఏభైమందికి పైగా ఉంటారేమో!

సీత ఎవరి కేరియర్లు వారివి వాళ్ళ సీటు దగ్గర పెట్టి గ్లాసులు కడిగి మంచి నీళ్ళు తెచ్చి పెడుతోంది. నా కేరియర్ తెరిచి భోజనం చేయడానికి ఉపక్రమించాను.

సీత వస్తేచాలు! లంచ్ అవర్ అయినట్టే!బెల్ వినపడక పోయినా, సీత సెక్షన్‌లో అడుగు పెడితే ఒంటిగంట దాటినట్టే లెక్క!

గోపాలకృష్ణ నాసీటు దగ్గరకు వచ్చాడు.

"ఏం? మీరు హొటల్‌కు వెళ్ళరా!" అన్నాను ఇబ్బందిగా. నేను తింటూ అతను చూస్తూ కూర్చుంటే బావుంటుందా?!

"లేదుగురూ! ఆకలి వెయ్యటంలేదు. సీతమ్మని చూస్తుంటే అసలు అన్నమే గుర్తుకు రాదు గురూ! ఎంత బావుంది. ఇవేళ రోజూకంటే మరీ అందంగా ఉంది. అవయవాలకు తగ్గ సౌష్ఠము...సౌష్ఠవానికి మించిన అందం...అందమైన ఆమె మొహంలో చూపరులను ఆకర్షించే గుణం... మొహాన్ని మింగేసినట్టున్న కళ్ళు... ఆకళ్ళల్లో చురుకు దనం...అబ్బ! గురూ! సీతమ్మ ఒడిలో ఓలలాడే అదృష్టమే అదృష్టం!"

పళ్ళుపటపటా కొరికాను. గోపాలకృష్ణ మాటలు వింటుంటే ఎందుకో నాకే తెలియని ఉద్వేగం నన్ను ఊపేస్తోంది.

కాని, గోపాలకృష్ణ అమాయక వదనం చూసేక జాలి కలిగింది.

పూర్ గోపాలకృష్ణ!

రెండేళ్ళుగా చూస్తున్నాడు తను. సీతని ఎంత మంది 'ఆకలి' చూపులు చూస్తున్నారో మరెంత మంది 'ఆమె' కటాక్ష వీక్షణల కోసం కళ్ళుకాయలు చేసుకు చూస్తున్నారో ఎందరు 'ఆమె' పొందు కోసమే బ్రతుకుతున్నారో తనకు తెలుసు!

ఆఖరికి సూపర్నెంటు గారు కూడా సీతతో హాస్యాలాడందే ఉండలేరు.

ఆడది అయస్కాంత మన్నారు ఇందుకేనేమో!

పెళ్ళికెదిగిన కూతురుండి కూడా పరాయి స్త్రీ పొందు కోసం ప్రాకులాడే ముసలి సూపర్నెంటులు.

కోడె వయసులో కోర చూపులు చూసే, చెల్లెల్ని పట్టించుకోకుండా వయసు వేడి 'ఆమె' నికూడా దహించే స్తోందన్న విషయం గ్రహించకుండా ఇంకో ఆడదాని అందానికి చొంగలు కార్చే అన్నలు.

...ఇందరు...ఇన్నిరకాలుగా 'సీత' చుట్టూ 'కళ్ళవల' వన్నారని గోపాలకృష్ణ కేం తెలుసు?!

"అదేం గురూ! అలా మౌనంగా ఉండిపోయారేం!" అన్నాడు గోపాలకృష్ణ నా భుజం తడుతూ.

ఆలోచిస్తున్న వాడ్ని ఉలిక్కి పడ్డాను.

"నాకు తెలియక అడుగుతాను గురూ ఆసీతమ్మకి మన ఎకవుంటెంట్ పాపారావుగారికి కనక్షన్ ఉందంటారు. నిజమే నంటారా?!"

"నాన్సెన్స్! ఎవడో దద్దమ్మా...ఏదో వాగేడని నువ్వూ నమ్మేయడమేనా?" అన్నాను ఆవేశంగా. మళ్లా నా ఆవేశానికి నేనే నొచ్చుకున్నాను. గోపాలకృష్ణని అని ఏంప్రయోజనం. అందరూ అనుకుంటున్నదే అతనూ విని అంటున్నాడు.

ఛీ! ఏం సంస్కారులు వీళ్ళు? ఆడది కనిపిస్తే చొంగలు కార్చేసి... ఆ ఆడది ఎవడితోనో నోరుజారి మాట్లాడితే కాలు జారిందని కారు కూతలు కూస్తారు. వీళ్లూ ఓ తల్లికి తనయులని ఓ చెల్లికి అన్నలని ఆలోచించరేం!

"గురూ! మీరు ఎందుకో కోపంగా ఉన్నారు." అదోలా చూస్తూ భయంగా అన్నాడు గోపాలకృష్ణ.

"ఛ! కోపం కాదు అసహ్యం. మనిషిని మనిషిగా గౌరవించలేని 'మన' కుసంస్కారాన్ని సహించలేక...భరించలేక అలా అన్నాను. దినం గడవక పొట్ట చేత పట్టుకొని పదిమంది మగాళ్ళకూ కేరియర్‌లు మోస్తున్నంత మాత్రాన ఆమెని అలా...అంత చులకనగా చూడటం భావ్యమంటారా? చెప్పండి. పదిమంది మధ్యా ఏడ్చే బిడ్డడికి పాలిచ్చే తల్లిని సిగ్గులేక బరితెగించిన ఆడదని అంటారా? ఆలోచించండి" అన్నాను.

గోపాలకృష్ణ మరేం మాట్లాడ లేదు.

సీత కేరియర్లన్నీ కడిగేసి సర్దుకుంటోంది.

"సీతమ్మా! ఓ సారి ఇలారా!" ఎకౌంటెంట్‌గారు సీతని పిలిచారు.

సీత ఆయనదగ్గరకు వెళ్ళింది.

తలఎత్తి ఇద్దర్నీ ఓరకంట గమనిస్తూ కూర్చున్నాను.

"సాయంత్రం వనుంది వస్తావా!"

"లేదండీ! రాలేను. మా చిన్నాడికి జ్వరం గుంది. మందులు కొనుక్కెళ్ళాలి." అంది సీత. అలా అని ఓరగా నావైపు చూసింది. నేను గబుక్కున చూపులు క్రిందికి దించుకున్నాను.

"ఏమోయ్! స్వామినాధం! నువ్వు ఈ నెల సీతమ్మ జీతం ఇవ్వలేనట్టుందే!" వ్యంగ్యంగా అన్నారు ఎకౌంటెంట్‌గారు.

నా మనసు చివుక్కుమంది. జేబులో పైసాలేదు. పదిమంది లోనూ ఎకౌంటెంట్‌గారు అలా చులకనగా మాట్లాడేసరికి ఏంచేయాలో నాకు అంతుబట్ట లేదు.

ఎదురుగా గోపాలకృష్ణ అపద్భాందవుడిలా దర్శన మిచ్చాడు.

"గోపాలకృష్ణగారూ! ఓసారిలావస్తారా?!" అన్నాను.

నవ్వుకుంటూ నాదగ్గరకు వచ్చాడు. అతని దగ్గర పదిహేను రూపాయలు అప్పుతీసుకొని సీత చేతిలో పెట్టాను.

సాయంత్రం ఆఫీసు మూసేసాక గోపాలకృష్ణ కలిసాడు.

"గురూ! మీరేమీ అనుకోనంటే ఓ విషయంచెప్తాను."


"చెప్పండి!" అన్నాను నవ్వుతూనే!

"మీకు...మీకు అప్పుల అప్పారావని నిక్ నేమ్ ఉందట. సారీ! ఇలా అన్నానని బాధ పడకండి. మీశ్రేయస్సు కోరిన వాడిని కనుక మిమ్మల్ని అందరూ దూషించి మాట్లాడుతుంటే భరించలేక....మీగురించిన చెడు ప్రచారం చెవిన పడ్డాక దాచుకోలేక మీకు చెప్పాను. మీకు ఎవరు కొత్తగా పరిచయం అయినా చెయ్యి చాస్తారట."

నాకు మరేం మాట్లాడాలని పించలేదు. గబగబా అడుగులు వేస్తూ బస్సు స్టాప్ చేరుకున్నాను అక్కడ గోపాలకృష్ణ ఆగిపోయాడు. అతనికి చెప్పకుండానే ముందుకు సాగిపోయాను.

ఆ మర్నాడు.

కొంచెం వేగంగానే ఆఫీసుకు వెళ్ళి నాసీట్లో కూర్చున్నాను.



## అది కాఫీయే !

ఓ హొటల్లో సర్వరాయుడు అతి వినయం ఒలకబోస్తూ "బిల్లు రాయాలి సార్ .... మీకేమిచ్చానో జ్ఞాపకం లేదు. కాఫీయా....టీయా?" అనడిగాడు.

"అదేమిటో నాకూ తెలియదు. చిక్కటి ముద్దలా వుంది" అన్నాడు మండిపడుతూ 'కష్ట'మరు.

"అయితే అది కాఫీయే సార్....మా టీ బంకలా వుంటుంది."

గోపాలకృష్ణ ఆఫీసులో అడుగు పెట్టీ పెట్టగానే నాదగ్గరకు వచ్చాడు.

"సారీ! గురూ! తప్పయిందీ. క్షమించండి!" అన్నాడు.

"పర్లేదు. నిజం చెప్పాలంటే నాదే తప్పు. ఏదేమనను బాగాలేక అలా అసభ్యంగా ప్రవర్తించాను. సారీ." నవ్వేస్తూ అన్నాను.

"అమ్మా!" అన్నారెవరో ఉన్నట్టుండి.

పనిలో నిమగ్నమయిన వాళ్ళందరూ ఉలిక్కపడి తలలెత్తి చూసారు.

పాపం! పెన్సిల్ చెక్కుతున్న ఎకౌంటెంట్‌గారి వేలు తెగింది. రక్తం ధారలా స్రవిస్తోంది. గబాలున సీట్లోంచి లేచి వెళ్ళి రక్తం కారకుండా గాయం నొక్కపట్టి పట్టుకున్నాను.

గోపాలకృష్ణ ఫస్టు ఎయిడ్ చేసాడు.

అంతే!

అప్పట్నుండి అందరూ పన్లుమానేసి ఎకౌంటెంట్‌గారి గాయాన్ని మర్చిపోవడానికన్నట్టూ జోకులు వేసుకుంటూ గడిపేసారు.

మధ్యాహ్నం!

సీత కేరియర్లు పట్టుకొచ్చింది. ఎవరి కేరియర్‌వాళ్ళ దగ్గర పెట్టీ మంచి నీళ్ళు తేవటానికి వెళ్ళింది.

ఎకౌంటెంట్‌గారు కేరియర్‌విప్పి ఆలోచిస్తూండి పోయారు.

"ఏం బాబూ!" మంచి నీళ్ళగ్లాను పెడుతూ అంది సీత.

సీత గొంత వినేమో సెక్షన్లోని వాళ్ళంతా వాళ్ళిద్దరి వైపు దృష్టి కేంద్రీకరించారు.

"ఏం లేదు" అన్నారు ఎకౌంటెంట్‌గారు.

"ఏవీ లేదేవిటి బాబూ! చేతికి అంత పెద్దగాయమైతే, నేను అన్నం కలిపి చేతిలో ముద్దలు పెడతాను తినండి." అంది సీత.

సీత గొంతులోని ఆప్యాయతకు...అభిమానానికి నా గుండే ఆర్ద్రతతో నిండిపోయింది. ఆక్షణం-సీత కళ్ళల్లో తడి అలలా కదిలి కలలా మాయమైంది.

మౌనంగా తల దించుకొని భోజనం చెయ్యడం పూర్తి చేసాను.

అందరి కేరియర్లు సర్దుకుంది. వెళ్ళిపోతున్నదల్లా ఆగి గోపాలకృష్ణ దగ్గరకు వెళ్ళింది సీత.

"మీకు గది కావాలన్నారు కదా! ఆశీలు మెట్ల అవతల రాములవారి గుడి ప్రక్కన ఎక్కడో ఓ గది ఖాళీఉందట. ఇదిగో అడ్రను. వెళ్ళికనుక్కోండి." అని చీటీ బోర్లో నుండి తీసి గోపాలకృష్ణకు ఇచ్చింది.

సాయంత్రం నేనూ గోపాలకృష్ణ కలసి ఆఫీసునుండి బైటకు వచ్చాం. హొటల్‌కు తీసుకు వెళ్ళాడు బలవంతంగా. ఎందుకో అనుకున్నాను. ఇద్దరం కాఫీ సిప్ చేస్తుండగా అన్నాడు గోపాలకృష్ణ.

"చూసావా గురూ! సీతకినా మీద కన్ను పడింది. తెలివిగా గది వెదికి చూపించింది. నెరజాణ!"

నేనేం మాట్లాడలేదు. మాట్లాడనుకూడా.

ఎవడి పిచ్చి వాడికి ఆనందం.

నిలకడ మీద నిజం తెలుసుకుంటే గోపాలకృష్ణ తలబాదుకుంటాడు. తాను ఎంత అనహ్యంగా...ఎంత అనహ్యంగా ప్రవర్తించాడో గుర్తుతెచ్చుకొని.

"రేపు ఆదివారమే కదాగురూ! మీరూ రాకూడదు 'రూమ్' చూద్దాం." అన్నాడు గోపాలకృష్ణ.

"సారీ! నాకు వీలవదు." అనేసి బైటకు వచ్చేసాను.

గోపాలకృష్ణ కూడా బిల్లు చెల్లించేసి నావెనుకే వచ్చాడు.

నేను ఇంటి ముఖం పట్టాను.

గోపాలకృష్ణ బస్సు స్టాప్‌లో నిలబడ్డాడు.

ఆమర్నాడు-ఆదివారం!

షేవ్ చేసుకుంటూ కూర్చున్నాను. మాశ్రీమతి వంటపనిలో ఉంది. నాన్నగారులోపల కుక్కిమంచంలో కునికి పాట్లు పడుతూ నిద్రలోనే ఖంగు...ఖంగున దగ్గుతున్నారు.

"అరేయ్ స్వామీ! స్వామీ!" కర్రపట్టుకొని అడుగులో అడుగు వేసుకుంటూ నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చి అంది అమ్మ.

"ఏమమ్మా!" అన్నాను.

షేవ్ చేసుకోవడం పూర్తయింది. సామాన్లు సర్ది పెద్దమ్మాయిని పిలచిలోపల పెట్టమన్నాను.

"కంటి మందు అయిపోయి రెండ్నెల్లు అయిదిరా! ఈ నెలైనా కొనిపెట్టరా!" బాధగా అంది అమ్మ.

"అలాగే నమ్మా!" అన్నాను. కానీ అప్పటికే రాబోయే నెల జీతానికి లెక్క తేలిపోయింది. ఇక అమ్మ మందు మాటో!

"ఎప్పుడు కొంటావో? ఏమో!...అరేయే స్వామీ! నాన్నగారిని హాస్పటల్‌కు తీసుకు వెళ్ళవుటరా!" అంది నిష్ఠూరంగా.

"తీసుకువెళ్తానే," అన్నాను. ఆ మాట ఆమె మనస్సు సంతృప్తికే! బ్రతకని మనిషికి ఖర్చెందుకని ఏనాడైతే డాక్టర్ అన్నాడో ఆనాడే తండ్రి చావు కోసం ఎదురు చూస్తున్నాడు తను.

బ్రతకని తండ్రి కోసం జీవచ్ఛవాల్లా అర్ధాకలితో బ్రతుకుతున్న కుటుంబాన్ని మోసం చేయలేడు. నాశనం చేయ్యలేడు.

"ఎప్పుడ్రా! ఆయన కాస్తా పోయాకా!" అంది కోపంగా గొంతు కోపంతో మెలిదిరిగి కళ్ళల్లో కన్నీళ్ళ రూపంలో జాలువారింది. ముడతలు పడ్డ తల్లి మొహంలో బాధతప్ప మరే భావం లేదు.

"అమ్మా! నువ్వెళ్ళవే! నాకు తెలుసు ఎప్పుడు తీసుకు వెళ్ళాలో ఎలాతీసుకు వెళ్ళాలో..!" అన్నాను నా అసహాయతని...అసమర్థతని ఆగ్రహంగా మార్చి.

అమ్మ గొణుక్కుంటూ వెళ్ళిపోయింది.

బ్రతుకంటే ఇదేనా?...ఇంతేనా?

నిస్సారమైన ఈజీవితం—

ఈ సంసారం—

భగవాన్! పగవాడిక్కూడా ప్రసాదించకు.

బాధలు పడేవారిని చూసి ప్రమోదించకు.

ఎవరో తలుపులు తడుతున్నారు.

ఎవరండీలోపల!" ఎవరో కానీ, ఆగొంతు ఎక్కడో విన్నట్లనిపించింది. లేచి వెళ్ళి తలుపులు తీయాలను కున్నాను. కానీ, బద్ధకం నన్ను జయించేసింది.

"ఎవరండీ! లోపల! కేకలా విన్పించింది. ఉలిక్కిపడ్డాను.

ఎవరో! బాకీ పసూలుకే వచ్చుంటాడు. ఒకడా! ఇద్దరా! ఎవరొచ్చారో! ఆ వచ్చిన వ్యక్తికి ఏమని జవాబు చెప్పాలి?

ఓసేవ్! తలుపు తియ్యి!" బాధగా...భయంగా కళ్ళుమూసు కొని శ్రీమతిని కేకేసాను. వంట చేస్తున్న దల్లా వచ్చింది.

తలుపులు తీస్తున్న చప్పుడు.

నాకు గుండెల్లో దడపెచ్చుతోంది.

ఏం చెప్పి పంపించాలి వాళ్ళను.

ఇంటి ఓనరైతే వూరుకోడు. ఇల్లు ఖాళీ చేయిస్తాడు. రెండ్నెల్లు ఇంటి అద్దె బకాయి పడ్డందుకు ప్రక్కిల్లు ఖాళీ చేయించేసాడు కర్కోటకుడు.

"సీతగారూ! మీరా!"

పరిచయమున్న గొంతు పలికేసరికి ఉలిక్కిపడి తలెత్తాను.

గోపాలకృష్ణ!!!

"స్వా...మి...నా...థం...గా...రూ!" మీరు...మీరు..." గోపాలకృష్ణ గొంతులో తడబాటు.

"మీకు కావాల్సిన గది ప్రక్కనుంది అడగండి." సీత అంది.

"అది కాదండి. మీరు..." గోపాలకృష్ణ అయోమయంగా అన్నాడు.

"మా ఆవిడ...నాభార్య....నా అర్ధాంగి...నాశ్రీమతి." గబగబా అనాలనిపించింది.

కానీ, నా గొంతు నిండా...గుండెల్నిండా... మనసు నిండా... మెదడునిండా...ఏదో పిచ్చి!...మరేదో ఉన్మాదం!

ఆక్షణం—

నా మెదడులో శతఘ్నులమోత!

నా గుండెల్లోకి ఫిరంగి గుండు దూసుకు పోయినంత బాధ.

"గురూ! ఏమిటండీ...ఇదంతా!" గోపాలకృష్ణ కళ్ళనిండా కన్నీరు.

"దరిద్రం....దరిద్రం గోపాలకృష్ణగారూ."

సీత వెక్కి వెక్కి ఏడుస్తూ అంది.

ఎన్నాళ్ళనుండో...ఎన్నేళ్ళనుండో నాతో పాటు ఈ సంసారాన్ని ఈదుకొస్తున్న ఆమె గుండెల్లో గూడు కట్టు కున్న దుఃఖం ఒక్కసారి లావాలా ఉప్పొంగింది. ■



ఎలా ?

"మా అక్కయ్య వంటల క్లాసులకు వెళుతోంది. మొన్న రాత్రి ఓ స్వీట్ చేసింది. అబ్బ .... ఎలా వుందో .... ఇంట్లో రెండు సుత్తులు విరిగి పోయాయి. ఇవాళ చల్లటి సేమ్యా పాయసం చేసింది" అంది రమ స్నేహితురాలితో.

"మా ఇంట్లోనూ చేసుకుంటామే" అంది స్నేహితురాలు.

"నీ మొహం .... మా అక్క సేమ్యాని చన్నీళ్ళల్లో ఉడకబెట్టింది !"